# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-04- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 9 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# ఈ సాలా కప్ ఆర్సీబీదే..



ఎట్టకేలకు 18వ ప్రయత్నంలో ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ కల సాకారమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్లో ఆర్సీబీ విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది.

8లో..



# రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

## కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం

- కాళేశ్వరం నివేదికలపై కీలక చర్చ
- ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు, రికవరీ సూచనలు
- ఆదర్శ రైతుల నియామకం అంశంపై నిర్ణయం
- రైతు వేదికల్లో భూసార పరీక్షలు, సలహాలు
- రాజీవ్ యువ వికాసం పథకం మార్గదర్శక చర్చ
- ఉద్యోగుల డీఏ, భత్యాల పరిష్కారం పై చర్చ
- వానాకాలం పంటల సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంపై స్పష్టత

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ నివేదిక, జాతీయ డ్యామ్‌ల భద్రతా ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికలపై చర్చించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. భారీస్థాయిలో ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలతోపాటు రికవరీ చేయాలని కమిషన్ సూచించిన విషయం విదితమే. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఆదర్శ రైతులను నియమించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. రైతు వేదికలకు ఆదర్శ రైతులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి, భూసార పరీక్షల నిర్వహణ కిట్లు వారి

మిగతా 2లో..

# తెలంగాణ నేతన్నకు భరోసా పథకం

## మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

- బడ్జెట్ లో 48.00 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- సంవత్సరానికి రెండు విడతలుగా నేత మరియు అనుబంధ కార్మికులకు అందనున్న వేతన ప్రోత్సాహకం
- 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి
- తెలంగాణ చేనేత వస్త్రాలకు ప్రత్యేక లేబుల్
- మంత్రి తుమ్మల వెల్లడి

2లో..





# మంత్రి సీతక్కతో అంగన్‌వాడీ యూనియన్ భేటి...

- పలు సమస్యలపై చర్చ
- పరిష్కారానికి మంత్రి హామీ

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

అంగన్వాడీ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పైన ఐసిడిఎస్ మంత్రి సీతక్కను ములుగు జిల్లా క్యాంప్ ఆఫీస్ లో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ ఈ మధ్య ప్రభుత్వం ఇచ్చిన స్త్రీ అశీ 8ని సవరించాలని, మినీ టీచర్స్ పెండిరగ్ వేతనాలు, 24 రోజుల సమ్మె కాలం వేతనాలు, ఇతర హామీలపైన మంత్రి గారితో చర్చలు జరిగాయి.

మిగతా 2లో..



# యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్ యూనివర్సిటీ విద్యార్థులతో కేటీఆర్ సమావేశం

- అమెరికా చట్టాలు,అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అర్థం చేసుకోవాలి
- ప్రపంచంతో ఇండియా పోటీపడి రాణించాలంటే విదేశాల్లో చదువుకుంటున్న యువత సహకరించాలి
- ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ మనదేశంలో అపార అవకాశాలు ఉన్నాయి
- ఉన్నత విద్య పూర్తి చేసుకుని మనదేశంలో కంపెనీలు స్థాపించండి-కేటీఆర్ పిలుపు
- విద్యార్థులతో సంభాషణ-ప్రశ్నలకు సమాధానం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామన్నారు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన

మిగతా 2లో..

# చదువు కుటుంబ భవిష్యత్తును మారుస్తుంది

- మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల లక్ష్య నిర్దేశం
- పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల సన్మానం
- బీసీ గురుకులాల విద్యార్హతపై మంత్రి అభినందనలు
- గురుకుల ఉపాధ్యాయుల కృషికి మంత్రి ప్రశంసలు
- ప్రభుత్వం నుండి ప్రోత్సాహక చర్యలు – మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపు
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాపనపై మంత్రి ప్రకటన
- జ్యోతిరావు పూలే జీవితం ఆధారంగా విద్యార్థులకు చైతన్యం
- చదువే భవిష్యత్తుకు మార్గదర్శకం – రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మంగళవారం బేగంపేట్ ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్ లో బీసీ గురుకులాలు, హాస్టల్స్ లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు , శుభాకాంక్షలు తెలిపారు. 593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని,590 మార్కులు తెచ్చుకున్న శివాని,580 కి పైగా మార్కులు తెచ్చుకున్న 31 మంది ,570 పైన మార్కులు తెచ్చుకున్న 216మంది విద్యార్థులు ,వారి తల్లి దండ్రులకు వారి ప్రాంతానికి రాష్ట్రానికి పేరు తెచ్చారని అభినందించారు.

మిగతా 2లో..



# మిస్ వరల్డ్ పోటీలకు ఖర్చు రూ.30 కోట్లే...

- రూ. 21 కోట్లు స్పాన్సర్ల ద్వారా వచ్చాయి
- రూ. 200 కోట్లు ఖర్చు చేశారని తప్పుడు ప్రచారం చేశారు
- వాటిని ఎక్కడ ఖర్చు అయ్యేయో బీఆర్ఎస్ నేతలు చెప్పాలి
- దీనిపై చర్చకు సిద్ధమా?
- బీఆర్ ఎస్ నేతలకు మంత్రి జూపల్లి సవాల్

3లో..

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)


ఆదీనంలో ఉంచడం, వ్యవసాయ అంశాలపై రైతులతో అవసరమైనప్పుడల్లా సమావేశాలు నిర్వహించి వారికి సూచనలు ఇచ్చే విధంగా వీరిని నియమిస్తారంటున్నారు. ఆదర్శ రైతులకు గౌరవ వేతనం మాత్రం ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేసినట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం.

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఇటీవల మంత్రులు జిల్లాల్లో పర్యటించిన సమయంలో వచ్చిన అభిప్రాయాలపై చర్చిస్తారు. పథకం ఎంపికలో ఎలాంటి పారదర్శకత కొనసాగించాలన్న దానిపై చర్చించడంతోపాటు, ఈ పథకాన్ని ఎప్పటి నుంచి ప్రారంభించాలన్న దానిపై మంత్రివర్గ స్పష్టత ఇవ్వనున్నట్టు తెలిసింది. ఉద్యోగులు ఆందోళన బాటలో ఉన్న సమయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో లోకేశ్‌కుమార్, కృష్ణభాస్కర్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం విదితమే. ఈ కమిటీ గతవారంలోనే తన నివేదికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందించింది. ఈ నివేదికపై చర్చించి ఆర్థిక పరమైన భారం పడే అంశాలను ప్రస్తుతానికి పక్కనపెట్టి, ఆర్థికేతర అంశాలను ఆమోదించేలా చర్చించనున్నట్టు తెలిసింది. అయితే ఐదు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఒక డీఏ అయినా క్లియర్ చేసే అవకాశం లేకపోలేదన్న చర్చ జరుగుతోంది.

వానాకాలం పంటల అంశం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్న తీరుపై కూడా చర్చించే అవకాశముంది. వాస్తవంగా జూన్ 2వ తేదీన కనీసం వంద ఇళ్లను ప్రారంభిస్తామని అధికారులు స్పష్టం చేసినా, అందుకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చోటు చేసుకోని విషయం విదితమే.

# తెలంగాణ నేతన్నకు భరోసా పథకం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)



నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ఈ నెల 2న జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు మంత్రి గారు తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000 మరియు అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రిగారు ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండిరగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి) నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రిగారు తెలిపారు.



# మంత్రి సీతక్కతో అంగన్‌వాడీ యూనియన్ భేటి...

(మొదటి పేజీ తరువాయి)

చర్చల అనంతరం మంత్రి సీతక్క గారు స్పందిస్తూ %స్త్రశీ అశీ% 8ని వెంటనే సవరిస్తామని, 2024 జులై 1 నుండి రిటైర్మెంట్ అయిన అంగన్వాడి ఉద్యోగులందరికీ పెంచిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వర్తించే విధంగా ప్రత్యేకంగా సర్కులర్ ఇవ్వాలని కోరగా అదేవిధంగా సర్కులర్ ఇచ్చే విధంగా చూస్తామని అన్నారు. మినీ టీచర్స్ 11 నెలల పెరిగిన వేతనాలు ఏరియర్స్ చెల్లించడం కోసం ప్రయత్నం జరుగుతుందని అన్నారు. కారుణ్య నియామకాలు కూడా ఇచ్చే విధంగా పరిశీలన చేస్తున్నామని అన్నారు. 24 రోజుల సమ్మె వేతనాలు తప్పకుండా చెల్లిస్తామని, కాకపోతే ఆర్థిక పరిస్థితి బాలేదు కాబట్టి కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది కొంత ఓపికతో ఉండాలని, దసరా సందర్భంగా రెండవ దఫాలో ఇందిరమ్మ ఇండ్లను కూడా అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చే విధంగా చూస్తామని అన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరగా ఈ అంశాన్ని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి రాష్ట్ర కోశాధికారి పి.మంగ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క రాష్ట్ర నాయకురాలు సిహెచ్.రమాకుమారి ములుగు జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు సరోజన జిల్లా అంగన్వాడి నాయకులు భాగ్యమ్మ, ధనలక్ష్మి, రుక్మిణి సిఐటియు ములుగు జిల్లా కార్యదర్శి రత్నం. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్ లో భూకంపం .. తప్పించుకున్న 200లకు పైగా ఖైదీలు

న్యూ డిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

పాకిస్థాన్‌లోని బఛా జైలు పరిసర ప్రాంతంలో భూకంపం రావడంతో 200లకు పైగా ఖైదీలు తప్పించుకున్నారు. సోమవారం ఇక్కడ మూడుసార్లు భూమి కంపించింది. దీంతో జైలులోని కొన్ని గోడలకు పగుళ్లు రాగా.. కొన్ని కూలిపోయాయి. ఈ క్రమంలో 600 నుంచి వెయ్యి మంది ఖైదీలను బ్యారక్‌ల నుంచి వేరే ప్రాంతానికి అధికారులు తరలిస్తుండగా.. ఖైదీలు తప్పించుకున్నారు పలువురు అధికారుల వద్ద ఉన్న తుపాకులు తీసుకొని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక ఖైదీ మృతి చెందగా.. నలుగురు అధికారులు గాయపడ్డారు.ఖైదీల పరారీతో అప్రమత్తమైన అధికారులు తిరిగి ఖైదీలను పట్టుకొనేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ 80 మందిని పట్టుకున్నామని.. అందుకు స్థానికుల సహాయం తీసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ జైలులో ఎక్కువ శాతం మాదకద్రవ్యాల సంబంధిత కేసుల్లోని నేరస్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని మరో అధికారి తెలిపారు. పారిపోయిన వారిలో డ్రగ్స్ నేరస్థులు, మానసికంగా సరిగా లేని వారే అని ఎక్కువ ఉన్నారన్నారు.



# చదువు కుటుంబ భవిష్యత్తును మారుస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

బీసీ గురుకుల పాఠశాలలు ,హాస్టల్ లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని మంచి బోధన అందిస్తున్నఅధ్యాపకవర్గానికి అభినందనలు మంత్రి తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో 17 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వందల్లోనే 570 కి పైగా మార్కులు వచ్చాయని అన్నారు.మరింత మంది విద్యార్థులకు మార్కులు వచ్చేలా మీ కృషి పెరగాలన్నారు.ప్రోత్సాహం మీ సమస్యలు పై పరిష్కారం ప్రభుత్వం ఎప్పటికపుడు పూర్తి చేస్తుందన్నారు.మీ దగ్గర నుండి మంచి ఫలితాలు రావాలని,విద్యార్థులు పాస్ మాత్రమే కాకుండా మంచి ర్యాంకులు వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ సంస్థ తరుపున ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు ఇస్తున్నామని తెలిపారు.ఈ అకాడమీ నుండి 140 స్కూల్ లలో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఉందని,మిగిలిన స్కూల్ లో ఎందుకు తక్కువ వచ్చిందని రివ్యూ చేయాలన్నారు. సంవత్సరంలో 300 రోజులు పిల్లలు ఉపాధ్యాయుల వద్దనే ఉంటారని,వారు పేరెంట్స్ కంటే ఎక్కువ గురుకులాల్లోనే మీ దగ్గర దగ్గరే ఉంటారని,వాళ్లలో మంచి చదువు నైపుణ్యాలు అందించాలని అన్నారు. ట్రెక్కింగ్ , సెయిలింగ్ పోటీలకు కూడా వారికి నైపుణ్యాలు అందిస్తున్నామని,చెడు ప్రభావమునకు లోను కాకుండా భవిష్యత్తును లక్ష్యంగా ఎంచుకొని మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా పోటీ ప్రపంచంలో నెగ్గి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. గతంలో చదువుకోవడానికి వసతులు లేవని మారుతున్న కాలానికి అనుగుణంగా తిండి లేకున్న మంచి చదువు అందించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారని అన్నారు. మీరంతా పోటీ ప్రపంచంలో నెగ్గేలా విధానపరమైన మార్పులను అవగతం చేసుకోవాలి.ప్రభుత్వం పిల్లలకు ప్రోత్సాహం ఇచ్చి వాళ్ళకి మంచి పౌష్టిక ఆహారం అందించడానికి 40 శాతం మెస్ చార్జీలు పెంచాం.200 శాతం కాస్మొటిక్ చార్జీలు ప్రభుత్వం పెంచిందని అన్నారు.మీ దగ్గర నుండి రైసింగ్ తెలంగాణ లో భాగస్వామ్యం కావాలి.రేపటి తెలంగాణ భవిష్యత్తుకి మీరు మార్గదర్శకులుగా కావాలి. మన పిల్లలు దేశ అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే స్థాయికి ఎదగాలని,స్టడీస్ ,ఆటలు ,ఇతర నైపుణ్యాల్లో మంచి ప్రతిభ కనబరచాలనిభవిషత్ లో మనం ఏం కావాలని అనుకుంటున్నామో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆదిశగా ముందుకు పోవాలి. విద్యకే పరిమితం కాకుండా సామాజికంగా అన్ని రంగాల్లో ముందుడాలి.గురుకులాల్లో ట్రెయిన్డ్ టీచర్స్ మంచి పరీక్షలు రాసి ఉద్యోగంలో వచ్చిన వారు ఉన్నారుఏ గురుకులాల్లో కూడా ఖాళీ స్థానాలు ఉండకూడదు.. అన్ని స్కూల్ లు 100 సీట్లు నిండాలని,అన్ని గురుకులాలు పోటీ పడి మాకు అందులోనే సీటు రావాలని విధంగా ఎదగాలి.చదువు కుటుంబాన్ని భవిష్యత్తును మారుస్తుందని,పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం కావాలంటే వారి చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చదువే అన్ని సమస్యలకు పరిష్కారం అని తెలిపారు.ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నదని ఇప్పటికే 58 స్కూల్ లు సంక్షన్ అయ్యాయని తెలిపారు.593 మార్కులు తెచ్చుకున్న దుర్గా భవాని ,590 మార్కులు తెచ్చుకున్న శివానిలకు ఇతర విద్యార్థులకు అభినందనలు , శుభాకాంక్షలు. జ్యోతి బాపులే సినిమా ను అన్ని గురుకులాల్లో చూపెడతాం.. తల్లిదండ్రులతో సహా చూపెడతామని అన్నారు.మహిళలు ఇంత గౌరవంగా చదువుకుంటున్నారంటే ఆనాడు సావిత్రి భాయ్ పూలే ఆదర్శాలు నేటికి ఈ ఫలాలే అన్నారు.చదువు ఒక్కరి సొత్తు కూడా అది అందరి సొత్తు..జ్యోతిరావు పూలే ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు , వారి తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంత్రి శాలువా, మెమెంటో, సర్టిఫికెట్ లతో మంత్రి సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్,కమిషనర్ బాల మాయాదేవి , గురుకుల సెక్రటరీ సైదులు ,ఎమ్బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య భట్టు, సిఈఓ అలోక్ కుమార్, వసతి గురువాహేల అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్ యూనివర్సిటీ విద్యార్థులతో కేటీఆర్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)



న్యాయసహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామన్నారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే ఆ విద్యార్థితో పాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురి అవుతుందన్నారు కేటీఆర్. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని కేటీఆర్ సూచించారు. స్థానిక చట్టాలతో పాటు ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. మంగళవారం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్ లో చదువుకుంటున్న విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అమెరికా పోవాలన్నా, చదువుకోవాలన్నా ఎన్నో వ్యయ, ప్రయాసలకు గురయ్యే వాళ్ళమన్న కేటీఆర్, ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాల పైన దృష్టి పెట్టాలన్నారు కేటీఆర్. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలన్నారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కెసిఆర్ జీవితమే సాక్ష్యమన్నారు కేటీఆర్. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని చెప్పారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కెసిఆర్ పై ప్రశంసల కురిపించారన్నారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కేటీఆర్ కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం-04- జూన్ 2025


# మిస్ వరల్డ్ పోటీలకు ఖర్చు రూ.30 కోట్లే...

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**



మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు సుమారు రూ. 30 కోట్ల ఖర్చు అయిందని, వీటి ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని పర్యాటక, సాంస్కృతిక శా ఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్ , సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం అయ్యాయని, మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రమోషన్ వచ్చిందని, మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని, ఆ వేడుకల నిర్వహణ, ఆతిథ్యం పట్ల కంటెస్టెంట్లు, మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సైతం ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అభినందించాల్సి పోయి విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలకు ఖర్చయింది రూ.30 కోట్లని, స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వానికి అయిన ఖర్చు రూ.9 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మరో 10 నుంచి 11 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయని వివరించారు. ఈ పోటీలపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని, గొప్పగా కార్యక్రమం నిర్వహిస్తే పలుచన చేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల విమర్శలు చూసి నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుకు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా? రూ.200 కోట్లు ఖర్చు అయినట్లు నిరూపించకుంటే ముక్కు నేలకు రాయాలి.. అని మంత్రి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రమోషన్లకే రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. ఇంత పెద్ద ఈవెంట్ ను తక్కు ఖర్చుతో ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. సొంత పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేశారని, అందగత్తెల కాళ్లు కడిగారని విష ప్రచారం చేశారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్నఘనత కేసీఆర్ దే నని అన్నారు. కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది పచ్చి అబద్ధం' అని, చౌమహల్లా ప్యాలెస్ విందులో ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష రూపాయాలు ఖర్చు చేశారనేది అవాస్తమని ఒక్కో ప్లేట్ కు అయిన ఖర్చు రూ. 8,200 మాత్రమేనని స్పష్టం చేశారు. తనపట్ల మిస్ బిహేవ్ చేశారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలను మంత్రి జూపల్లి ఖండిరచారు. ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దీనిపై కొందరు బీఆర్ఎస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అవన్ని అభూతక కల్పనలేనని చెప్పారు. మిస్ ఇంగ్లాండ్ ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులకు వచ్చిన వాళ్లు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే.. మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు మిస్ వరల్డ్ విన్నర్ గా గెలిచిన థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాతకు తెలంగాణ ఆథిత్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని చెప్పారు. తన జీవితంలో హైదరాబాద్ ను మరువ.. అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఓపల్ సుచాత చెప్పారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసర విషయాలను లేవనెత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ది కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.



## ఫారుక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా నాయకులు...

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ముచ్చర్ల గ్రామీణ వైద్యుడు మరియు మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం కామేపల్లి మండల నాయకుడు షేక్ ఫారుక్ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటు తో మరణించటం జరిగినది. ఇతని స్వగ్రామం అయిన పాలడుగులో జరిగిన అంతక్రియలలో మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం తరపున జిల్లా నాయకులు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసినారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ హసన్, జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ జానీమియా, జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ హసన్, వ్యవస్థాపకుడు షేక్ నజీరుద్దీన్, ఉపాధ్యక్షులు కాసిం, చాంద్ పాషా, జాయింట్ సెక్రెటరీ ఆశ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మొహమ్మద్ సాహెబ్, జిల్లా నాయకులు ఇస్సాక్ పాషా, మన్సూర్ అలీ ,మండల నాయకులు సైదా, గౌస్మియా, హమీద్ అలీ, రహీం, శంషుద్దీన్, ఫక్రుద్దీన్, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీలకు అతీతంగా లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్ల పంపిణీ

- **పేద ప్రజలందరికీ గూడు, నీడ కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.**
- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు**

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

హసన్ పర్తి మండల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నేడు ఎర్రగట్టుగుట్ట కెఎల్ ఎన్ ఫంక్షన్ హాల్ లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంజూరు పత్రాలను,వ్యవసాయ శాఖ తరుపున రైతులకు నాణ్యమైన విత్తనాల ప్యాకెట్లను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు అని తాము ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిర్ణీత సమయం, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకొని సహాయం పొందాలని ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసే సమయంలో ఏదో ఒక సారి మీ ఇంటికి వస్తానని, ఒక తోబుట్టువు వలె అండగా ఉంటానని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని, గత ప్రభుత్వం పెట్టిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ నూతన పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 కు సిలిండర్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, నూతన రేషన్ కార్డులు, సన్నం బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. గురుకులాల్లో ఒకే రకమైన భోజనం అందించాలని కామన్ డైట్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని గురుకులాల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రజలు ఎంతగానో ఇండ్ల కోసం ఎదురు చూశారని కానీ ప్రజాప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే ఇండ్ల పత్రాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇండ్ల మంజూరు పత్రాలను అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియచేశారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునేందుకు మహిళా సంఘాల ద్వారా అప్పు ఇప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారుల్లో ఎవరికైనా బ్యాంకు ఖాతాలు లేనట్లయితే తన సొంత ఖర్చులతో బ్యాంకు ఖాతాను తీసి ఇచ్చే విధంగా తోడ్పాటున అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ సీఈఓ, డిసివో, హౌసింగ్ పీడీ, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**–అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

బక్రీద్ పండుగ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో కులమతాలకు అతితంగా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ.. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్ లో పీస్ కమిటీ సభ్యులతో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జిల్లాలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని అందరూ గౌరవిస్తూ.. సంప్రదాయలనుపాటించాలని అన్నారు. త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు జరుపుకొనే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రత ఏర్పాట్లు పూర్తి చేశారని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ ఘనటలు, అసౌకర్యం కలగకుండా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులతో సహకరించాలని తెలిపారు. ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక కార్యక్రమాల సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఇప్పటికే పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణా నివారించడానికి 7 ప్రత్యేక చెక్ పోస్టులు మరియు హోల్డింగ్ పాయింట్స్‌లు ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. పాడి ఆవులను, లేగా దూడలను క్రయవిక్రయాలు జరపరాదని పేర్కొన్నారు. ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోడ్ల మీద ట్రాఫిక్ జామ్ లు ఏర్పడకుండా, ఇతర సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యకు తమవంతు సహకాహారం అందజేస్తామని అన్నారు. సమావేశంలో ఏసీపీ రమణమూర్తి, సిఐలు కరుణకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.





# పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- **దేవరుప్పలలో కాంగ్రెస్ క్లస్టర్ సమీక్ష సమావేశంలో ఝాన్సిరెడ్డి**

**జనగామ,తెలంగాణ ముచ్చట్లు:**

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పట్టుదలతో పనిచేయాల్సిన అవసరం ఉందని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. మంగళవారం నాడు దేవరుప్పుల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ల రివ్యూ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి కోఆర్డినేటర్ తాను నియమితుడైన గ్రామాల్లో ప్రజలతో సన్నిహితంగా




ఉండాలని, పార్టీ ఆవేశాలు, సిద్ధాంతాలను తెలియజేయడంతో పాటు గత పాలకుల అవినీతిని ప్రజలకు వివరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి గ్రామస్థాయిలోనే శ్రమించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

"పేదల కోసం అహర్నిశలు పోరాడిన పార్టీ మనది. ఇప్పుడు ప్రజల ఆశలు, అర్థాలన్నీ మళ్లీ కాంగ్రెస్ వైపు నిలబడ్డాయి. ఈ సంకేతాన్ని కార్యాచరణలోకి తేవాల్సిన బాధ్యత మనపై ఉంది. కట్టుబాటుతో, సమర్థతతో పని చేస్తే, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురాగలమని నమ్మకముంది" అని ఝాన్సిరెడ్డి తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, ఎంపీటీసీ సమన్వయకర్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. బూత్ స్థాయిలో చేపట్టాల్సిన వ్యూహాలు, స్థానిక సమస్యల పరిష్కార మార్గాలు, ప్రచార కార్యక్రమాల నిర్వహణపై చర్చ సాగింది. ప్రతి కోఆర్డినేటర్‌ను వ్యక్తిగతంగా ఉత్సాహపరిచారు. తగిన మార్గదర్శకతను అందించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ మల్లురవి ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు సాయిచరణ్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్.మల్లురవి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.సాయి చరణ్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన నూతన తెలంగాణ ప్రదేశ్ క్రమ శిక్షణ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైనందున నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా టి.సాయి చరణ్ రెడ్డి మాట్లాడుతూ....తెలంగాణ ప్రదేశ్ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నూతన చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ విధేయులు,నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్. మల్లురవి ఎన్నికైన ఈ శుభ సందర్భంగా ,హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి,శాలువతో సన్మానించి,ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఇట్టి ఎన్నికకు సహకరించిన రాహుల్ గాంధీకి, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే,ప్రత్యేకంగా ఏఐసీసీ సెక్రెటరీ పార్టీ సంస్థాగత అధ్యక్షులు కేసి వేణుగోపాల్ గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.అత్యుత్తమ సేవలందిస్తూ నమ్మకానికి నిలువెత్తు నిర్దర్శనంగా,రాజకీయ రాజకీయంలో అనుభవజ్ఞులైన నిపుణులు అంచలంచలుగా ఎదుగుతూ నేడు గల్లీ నుండిఢిల్లీ వరకు డాక్టర్.మల్లురవి పార్లమెంటు సభ్యులు, పేరు తెలియని వారంటూ ఉండరు అని హర్షం వ్యక్తం చేశారు. ప్రతినిత్యం ఎంతోమందికి పేద ప్రజలకు అమూల్యమైన సేవలు అందిస్తున్నారని, భవిష్యత్తు లో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.సాయిచరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

బుధవారం-04- జూన్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్ఫూర్తిదాయకం కడియం కావ్య రాజకీయ ప్రయాణం



**వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన కడియం కావ్య, ఈ ఏడాది తన ఎంపీగా గెలిచిన మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. వైద్య వృత్తిలో నైపుణ్యం, సామాజిక సేవలో అంకితభావం, రాజకీయంగా తనదైన ముద్ర వేస్తూ ఆమె తెలంగాణ రాజకీయాల్లో ఒక ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆమె జీవితం, రాజకీయ ప్రయాణం, సాధించిన విజయాలు, మరియు వరంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని పరిశీలిద్దాం.**



### బాల్యం మరియు విద్య

కడియం కావ్య తెలంగాణలోని వరంగల్‌కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు కడియం శ్రీహరి కుమార్తె. ఆమె దక్కన్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఉస్మానియా మెడికల్ కాలేజీలో పాథాలజీ లో ఎండీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) చేశారు.

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేసిన ఆమె, వైద్య రంగంలో తన నైపుణ్యాన్ని చాటుకున్నారు. వైద్య వృత్తితో పాటు, సామాజిక సేవలో ఆమె చూపిన నిబద్ధత ఆమెను ప్రజలకు దగ్గర చేసింది. కడియం ఫౌండేషన్ ద్వారా ఆమె వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకునేందుకు దోహదపడింది.

### రాజకీయ ప్రవేశం

కడియం కావ్య రాజకీయ ప్రయాణం అనూహ్య మలుపులతో నిండినది. తన తండ్రి కడియం శ్రీహరి, ఒక సీనియర్ రాజకీయ నాయకుడు మరియు తెలంగాణ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో కీలక వ్యక్తిగా ఉండడం ఆమెకు రాజకీయ ఆకాంక్షలకు స్ఫూర్తినిచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆమెను మొదట బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే, పార్టీలోని అంతర్గత రాజకీయ పరిణామాలు మరియు వ్యూహాత్మక నిర్ణయాల కారణంగా, కావ్య మార్చి 29, 2024న బీఆర్ఎస్ నుంచి తప్పుకుని, రాజీనామా చేశారు.



మార్చి 31, 2024న, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ మరియు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏప్రిల్ 1న, కాంగ్రెస్ పార్టీ ఆమెను వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నిర్ణయం ఆమె రాజకీయ జీవితంలో కీలకమైన మలుపుగా నిలిచింది.

### ఎన్నికల విజయం

2024 లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్య అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఆమె తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌పై 2,20,339 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. మొత్తం 5,81,294 ఓట్లతో ఆమె వరంగల్ నియోజకవర్గంలో తొలిసారి లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీకి వరంగల్‌లో బలమైన పునాదిని అందించడమే కాక, కావ్య రాజకీయ నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించింది.

ఆమె విజయం వెనుక కాంగ్రెస్ పార్టీ యొక్క వ్యూహాత్మక ప్రచారం, బీఆర్ఎస్ శ్రేణుల నుంచి ఆమెకు అందిన మద్దతు, మరియు ఆమె సామాజిక సేవల ద్వారా ప్రజలతో ఏర్పడిన సన్నిహిత సంబంధం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, కావ్య గెలుపు "నల్లేరు మీద నడక" లాంటిదని, ఆమె రాజకీయంగా సులభంగా విజయాన్ని అందుకున్నారని అభిప్రాయపడ్డారు.

### ఎంపీగా ఒక సంవత్సరం: సాధించినవి, సవాళ్లు

ఎంపీగా గత ఒక సంవత్సరంలో కడియం కావ్య వరంగల్ నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఆమె వైద్య నేపథ్యం ఆమెను ఆరోగ్య సంబంధిత సమస్యలపై దృష్టి సారించేలా చేసింది. వరంగల్‌లో ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరచడం, విద్యా సంస్థల అభివృద్ధి, మరియు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆమె ప్రాధాన్యత ఇచ్చారు.

కడియం ఫౌండేషన్ ద్వారా ఆమె చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, ఎంపీగా ఆమె పనితీరును మరింత బలోపేతం చేశాయి.

అయితే, ఆమె రాజకీయ ప్రయాణం సవాళ్లు లేకుండా లేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారడం వల్ల కొంతమంది ఆమెపై విమర్శలు చేశారు. అయినప్పటికీ, ఆమె తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, వరంగల్ ప్రజల అభివృద్ధి కోసం తాను ఏ పార్టీలో ఉన్నా అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

### ప్రజలతో సన్నిహిత సంబంధం

కడియం కావ్య యొక్క ప్రజాదరణకు ఆమె సరళమైన వ్యక్తిత్వం, ప్రజల సమక్షంలో లభ్యత, మరియు సామాజిక సేవలు ముఖ్య కారణాలు. ఆమె తన నియోజకవర్గంలో పర్యటిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటిని పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడం ద్వారా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. ఆమె ఎంపీగా గెలిచిన తర్వాత, వరంగల్ ప్రజల సంక్షేమం కోసం తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఒక ఎక్స్ పోస్ట్‌లో పేర్కొనబడింది, ఇది ఆమె పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని సూచిస్తుంది.



### భవిష్యత్తు లక్ష్యాలు

వరంగల్ నియోజకవర్గంలో ఆరోగ్యం, విద్య, మరియు గ్రామీణ అభివృద్ధితో పాటు, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం కడియం కావ్య యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆమె కృషి చేస్తున్నారు. అలాగే, ఆమె కాంగ్రెస్ పార్టీలో తన స్థానాన్ని బలోపేతం చేస్తూ, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాజకీయంగా మరింత చురుకైన పాత్ర పోషించే అవకాశం ఉంది.

### ముగింపు

కడియం కావ్య యొక్క రాజకీయ ప్రయాణం ఒక సామాజిక కార్యకర్త, వైద్య నిపుణురాలు నుంచి లోక్‌సభ సభ్యురాలిగా ఎదిగిన స్ఫూర్తిదాయక కథ. ఆమె ఎంపీగా గెలిచిన ఈ ఒక సంవత్సర కాలంలో, వరంగల్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి, ప్రజలతో ఆమె నిర్వహించిన సన్నిహిత సంబంధం ఆమెను ఒక నమ్మకమైన నాయకురాలిగా నిలబెట్టాయి. భవిష్యత్తులో ఆమె తెలంగాణ రాజకీయాల్లో మరింత కీలక పాత్ర పోషిస్తారని ఆశించవచ్చు.

# అభివృద్ధి దిశగా కడియం కావ్య అడుగులు

## ఎంపిగా ఏడాది పదవి కాలం పూర్తి

### ప్రారంభం నుంచే కృషిలో భాగస్వామ్యం

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కడియం కావ్య, 2024 సాధారణ ఎన్నికల్లో 5,81,294 ఓట్లు సాధించడంతో పాటు, 2,20,339 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నేడు ఎంపీగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది అనుసరించిన కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాధాన్యతలు, భవిష్యత్ దిశను వివరించారు.

### ప్రారంభం నుంచే కృషిలో భాగస్వామ్యం

భారత జాతీయ కాంగ్రెస్ పట్ల నమ్మకంతో పాటు, రాజకీయాలలో తన తండ్రి కడియం శ్రీహరి ప్రేరణతో ముందుకు సాగుతున్న కావ్య, ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునుంచి ప్రజా సమస్యలపై దృష్టికేంద్రీకరించారు. వరంగల్ అభివృద్ధే లక్ష్యంగా పార్లమెంట్ వేదికగా పలువురు కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు.

### విద్య, యువతపై ప్రత్యేక దృష్టి

వరంగల్‌ను విద్యా కేంద్రంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు కొనసాగిస్తున్నారు. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటు ద్వారా స్థానిక ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

**ప్రధాన విజయాలు**

- మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు చొరవ
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విస్తరణకు నిధుల సమీకరణ
- సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణానికి పురోగతి
- ఫాతిమా నగర్ ఫ్లై ఓవర్ పనుల వేగవంతీకరణ



### మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధి

స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలుతోపాటు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహం, పారిశ్రామిక కారిడార్ స్థాపన, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు నిధుల సమీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### మహిళా సాధికారత, సామాజిక న్యాయం

అణగారిన వర్గాల సాధికారతపై దృష్టి సారిస్తూ, వరంగల్‌లో 20 శాతం షెడ్యూల్డ్ కులాల ఉన్నతిని కాంక్షిస్తూ పార్లమెంట్‌లో అనేక అంశాలను లేవనెత్తారు. మహిళలకు ఆర్థిక, సామాజిక రంగాల్లో అవకాశాల కల్పన కోసం చర్యలు చేపట్టారు.

### పార్లమెంటరీ చురుకుదనం

ఎంపీగా తొలి ఏడాదే లోక్‌సభలో చురుకుగా చర్చల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో పేర్కొన్న హామీలు, రైతుల సంక్షేమం, ఆరోగ్య సేవలు, ఉపాధి వంటి అంశాలను లోక్‌సభకు లేవనెత్తారు.

వరంగల్‌కు కేంద్ర నిధుల్ని సమకూర్చేందుకు చొరవ తీసుకున్నారు.

### నియోజకవర్గంలో నేరుగా ప్రజల మధ్యకి

గన్‌పూర్ స్టేషన్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాలను నియమితంగా సందర్శిస్తున్నారు. ప్రజా సమావేశాలు, సమస్యల పరిష్కార శిబిరాల ద్వారా ప్రజల మద్దతు తీసుకుంటున్నారు.

### సవాళ్లు, భవిష్యత్ దిశ

కేంద్ర నిధుల జాప్యం, బ్యూరోక్రటిక్ వ్యవస్థల ఆటంకాల మధ్యలో ముందుకు సాగుతున్న కావ్య, వచ్చే నాలుగేళ్లలో వరంగల్‌ను విద్య, పరిశ్రమ, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. కాకతీయ వారసత్వ పరిరక్షణ, అవినీతిపై పోరాటం, పారదర్శక పాలన వైపు నిబద్ధతకు పూనుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

### ప్రాతినిధ్యానికి విశ్వాసం

ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ సమస్యలను ప్రతిధ్వనింపజేసే గళంగా తన పాత్రను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.



ఈ ఏడాది కాలం ప్రస్థానం ద్వారా ఎంపీగా కడియం కావ్య ప్రజల నడుమ నేరుగా ఉండేందుకు ప్రయత్నించడంతో పాటు, పార్లమెంటరీ వ్యవహారాల్లో చురుకుదనాన్ని ప్రదర్శించారు. అయితే, ప్రకటించిన ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రమైన నివేదికలు ప్రజలకు అందించడం అవసరం అనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది.

# మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపిన కమలేష్, ప్రసాద్

- **పద్మ శ్రీ వచ్చిన సందర్భంగా వారిని మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ యువనాయకులు**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ యువ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం సాగిస్తున్న ఆయన గుర్తింపు దేశవ్యాప్తంగా గర్వకారణమని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మారపల్లి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి అనంతపురం కమలేష్,అభినందనలు తెలిపారు.



వెనుకబడిన వర్గాలకు న్యాయం చేకూర్చేందుకు మందకృష్ణ చేసిన త్యాగాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు ప్రశంసనీయమని వారు కొనియాడారు. భవిష్యత్తులోనూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేపట్టే కార్యాచరణలకు పూర్తి మద్దతు అందిస్తామని, సమాజ మార్పు కోసం ప్రతి అడుగులో తోడుగా ఉంటామని కమలేష్, ప్రసాద్ తెలిపారు.

# కదిలింది బడిబాట

పని మానె బాలుడు,
పాఠశాల తలుపు తట్టాడు,
కలలతో నిండె నేలకే నడిచాడు.
ఊరు వాడ గూడెం తాండ,
ప్రతి బిడ్డ బడిలో అడుగిడే వేళ ఇది!
విద్యే మార్గం, విద్యే వెలుగు,
మన రాష్ట్రం కలలో కదిలిన బడిబాట.
శిక్షణలతో నిబద్ధతతో,
మానసిక వికాసమే లక్ష్యమై
ముందడుగు వేసింది.

చదువు చేతిలో ఆయుధమై,
పేదవాడి నోట నవ్వులై.
పుస్తకమే పునాదిగా,
విద్యార్థి విజ్ఞానమే గమ్యంగా.

అధునాతన పరికరాలు,
అతినూతన బోధనా విధానాలు,
ప్రతి గదిలో ఆశయ దీపాలు,
ప్రతి గుండెలో ఆశాభవితాలు!

సర్కారు బడి అంటే భరోసా బడి,
బడుగు బ్రతుకులకు నిలువెల్లడి.
చదువులమ్మ చాటిచెప్పే ఈ మాట:
"బడి వదలకుము, భవిష్యత్తు
గెలుచుకోము!"



రచన :
**సుతారి మురళీధర్,**
జెడ్పీ హైస్కూల్ పత్తిపల్లి,
ములుగు జిల్లా.
కాంటాక్ట్ : 9618939828

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# దేశానికే తలమానికంగా భూ భారతి చట్టం రూపకల్పన.....

**డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

మంగళవారం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి ప్రారంభించారు.



డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాలలో దశాబ్దాల కాలంగా పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా 413 గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దు లను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు క్రింద ములుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేసామని తెలిపారు.

దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణ టెనెన్సీ యాక్ట్ 1950 ద్వారా పేదలకు భూ హక్కులను కల్పించామని, 1971 ఆర్.ఓ.ఆర్. చట్టం, 1973 భూ సంస్కరణల కారణంగా రైతులకు చాలా మేలు జరిగిందని, ఈ చట్టాల కారణంగా భూమి లేని నిరుపేదలకు మిగులు భూమి పంపిణీ చేసి వారికి గౌరవం కల్పించామని అన్నారు.

2020 సంవత్సరంలో వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, భూమి హక్కులు లేకపోయినా అదనంగా పాస్ పుస్తకాలు అందించడం, గత చట్టాల వల్ల వచ్చిన భూ హక్కులను కాల రాస్తూ మరొకరి పేరు మీద భూములు ఎక్కించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని అన్నారు.

మార్పులు, చేర్పులు చేసేందుకు రెవెన్యూ వ్యవస్థలో ఎటువంటి అవకాశం లేకుండా గత ప్రభుత్వం చట్టం తీసుకుని వచ్చిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉపయోగపడే విధంగా అందరి సలహాలు స్వీకరించి భూ భారతి చట్టం తీసుకొని వచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో భూమి సుంకం చెల్లించే సమయంలో రైతులు తమ పేరిట భూములు ఉన్నాయని వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఉండేదని, ధరణి చట్టం వల్ల అటువంటి అవకాశం లేకుండా పోయిందని డిప్యూటీ సీఎం తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూమి అమ్మకాల, కొనుగోలు వివరాలను అప్ డేట్ చేస్తూ, భూ రికార్డులను మాన్యువల్ గా రాసి పంచాయతీ కార్యాలయంలో అతికించడం జరుగుతుందని అన్నారు.

భూ సంస్కరణల కారణంగా రాష్ట్రంలో దాదాపు 26 లక్షల ఎకరాలు పేదలకు అసైన్డ్ చేస్తూ పంపిణీ చేయడం జరిగిందని, ధరణి లో ఇట్టి భూములను పార్ట్ బీ లో పెట్టి ప్రజలకు ఇబ్బందులకు గురి చేశారని, అర్హులైన వారికి భూ భారతి చట్టం ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు.

భవిష్యత్తులో అసెంబ్లీ సెగ్మెంట్ వారిగా అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మిగులు భూములను ఇంటి పట్టాల పంపిణీ, భూ పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశ పెడ్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజలకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారుల దగ్గరే పరిష్కరించుకునేలా అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు.

మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పట్టాపాస్ పుస్తకాలలో ఉన్న తప్పుల కారణంగా రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, గ్రామంలో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాలలో వేల ఎకరాలు ఉన్నట్లు ఉందని, దీనివల్ల ప్రభుత్వంపై కూడా భారం పడుతుందని మంత్రి తెలిపారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల అన్నదమ్ములు, స్నేహితుల మధ్య కూడా గొడవలు జరిగి హత్యల వరకు దారి తీస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, మన శక్తి మేరకు వేగవంతంగా సర్వే చేసి నిఖార్సైన రికార్డులు తయారు చేస్తామని అన్నారు. దేశంలో శాంతి భద్రతలు మన తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతంగా ఉన్నాయని, ప్రజా ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులను సాధించిందని, ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడుతుందని మంత్రి అన్నారు. భూముల రికార్డులు సక్రమంగా నిర్వహించేందుకు రైతులు, భూ యజమానుల నుంచి టోకెన్ అమౌంట్ సేకరించాలని మంత్రి సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఒకే సంవత్సరంలో 36 వేల కోట్ల రూపాయలను నేరుగా అందించామని తెలిపారు. నాట్లకు ముందే రైతు భరోసా పథకం నిధులు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత క్రింద ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇండ్లను మంజూరు చేసిందని, వీటిని గుడిసెలలో ఉండే పేదలను ఎంపిక చేసి అమలు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఒక అనర్హుడికి ఇండ్లు కేటాయించినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రోడ్లు విశాలంగా ఉంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, రోడ్డు విస్తరణ కోసం ప్రజలు ముందుకు రావాలని మంత్రి తెలిపారు. దేశానికే తలమానికంగా భూ భారతి చట్టం మన జిల్లాలో అమలు చేయడం జరుగుతుందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభిలాష మేరకు ప్రభుత్వం పాలన అందించాలనే లక్ష్యంతో, గత పాలకులు ప్రజలపై రుద్దిన ధరణి చట్టం వల్ల రైతులు, ఆసాములు పడిన ఇబ్బందులు తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను స్టడీ చేసి భూ భారతి చట్టం ఏప్రిల్ 14 న ప్రవేశ పెట్టిందని అన్నారు.

భూ భారతి చట్టం అమలు ప్రజలపై ఎటువంటి ప్రభావం ఉంటుందో గమనించాలని ముందస్తుగా నాలుగు మండలాలను, రెండో విడతలో ప్రతి జిల్లాలో ఒక మండలం పైలెట్ క్రింద ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి ఒక రూపాయి కూడా ఫీజు తీసుకోకుండా వారికి ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని, పేదలకు చుట్టంగా భూ భారతి చట్టం పని చేస్తుందని అన్నారు. రాబోయే ఆగస్టు 15 నాటికి ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు భద్రత కల్పిస్తామని అన్నారు. రాష్ట్రంలోని 413 గ్రామాలలో సరైన భూ రికార్డులు, నక్షాలు లేవని, వీటిలో 5 గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ క్రింద చేపట్టి దేశంలోని 5 ప్రముఖ సంస్థల ద్వారా సర్వే చేస్తున్నామని, వీటిలో ములుగుమాడు గ్రామం కూడా ఉందని అన్నారు. డ్రోన్, డిజిపిఎస్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించి కొలతలలో ఎటువంటి పొరపాటు లేకుండా పకడ్బందీగా నక్షా తయారు చేస్తామని అన్నారు.

భూ హక్కులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న గతంలో సివిల్ కోర్టుకు వెళ్ళాల్సి ఉండేదని, నేడు రెవెన్యూ కోర్టుల ద్వారా అధికారుల వద్ద వాటికి పరిష్కారం లభిస్తుందని అన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు వరకు పేదలకు పంచిందని, అటువంటి భూములను ధరణితో పేరుతో లక్షలాది ఎకరాలను తారుమూరు చేశారని, వీటిలో జరిగిన అక్రమాలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తామని, అసైన్డ్ భూ హక్కుదారులకు కూడా పూర్తి హక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రైవేట్ వ్యవస్థలో మొదటి విడత క్రింద రాష్ట్రంలో 6 వేల మంది సర్వేయర్లకు శిక్షణ అందించి వారికి లైసెన్స్ జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఒక రెవెన్యూ అధికారి ఉండే విధంగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 556 మంది రెవెన్యూ అధికారులను రాబోయే నాలుగు రోజులలో నియమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ భూముల సర్వే చివరి సారిగా 1950 లలో కొంతమేర జరిగిందని, అనంతరం చిన్న కుటుంబాలు ఏర్పడి నప్పటికీ చాలా కాలం వరకు సర్వే జరగలేదని అన్నారు. భూముల సర్వే నెంబర్లలో రెండు కోట్ల వరకు సబ్ డివిజన్లు ఉంటే, 40 లక్షల వరకు మాత్రమే మ్యాప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విలేజ్ మ్యాప్ లేని 413 గ్రామాల్లో నూతనంగా సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ములుగుమాడు గ్రామం నుంచి సర్వే ప్రారంభమవుతుందని కమీషనర్ తెలిపారు. డ్రోన్, డిజిపిఎస్ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సర్వే చేస్తామని, దీని వల్ల ఖచ్చితమైన భూ కొలతలు తీసుకోవచ్చని అన్నారు.

మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ నెంబర్ భూమికి సంబంధించిన అన్ని వివరాలతో అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఇక నుంచి భూముల క్రయ, విక్రయాలకు తప్పనిసరిగా మ్యాప్ జత చేయాలని, దీని కోసం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా లైసెన్స్ ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని సిసిఎల్ఏ కమీషనర్ తెలిపారు.

ప్రభుత్వమే సర్వే చేయకుండా భూ యాజమాన్యులు కూడా ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి ప్రభుత్వ వెబ్ సైట్ లో నమోదు చేసి అనుమతి తీసుకుంటే భూ సర్వే క్రింద నమోదు అవుతుందని అన్నారు. ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ములుగుమాడు గ్రామంలో ఉన్న ప్రతి ఇంచు భూమికి సర్వే చేసి పట్టా పాస్ పుస్తకంతో పాటు మ్యాప్ కూడా భూ హక్కు దారులకు అందిస్తామని అన్నారు. పారదర్శకంగా సర్వే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని ఆగస్టు 15 నాటికి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.

సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ మాట్లాడుతూ ములుగుమాడు గ్రామంలో చేపట్టే పైలెట్ సర్వే కార్యక్రమం చాలా కీలకమైందని, ఇందులో వచ్చే ఫలితాలను ఆధారం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ములుగుమాడు గ్రామంలో కనీసం 4 నెలల పాటు ఈ సర్వే జరుగుతుందని, గ్రామ పెద్దలు సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తిగా సహకరించాలని కోరారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలు లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని నేడు ప్రారంభిస్తున్నామని అన్నారు. ములుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద సర్వే కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ తెలిపారు. భూములు సర్వే చేసిన తర్వాతే యాజమాన్య హక్కులు స్పష్టంగా తెలుస్తాయని, భూమి పంచుకునే సమయంలో సర్వే చేసుకోని కారణంగా పట్టాలో ఒక భూమి ఉంటే మనకు కబ్జాలో మరో భూమి ఉంటుందని, నక్షాలు లేని ములుగుమాడు గ్రామంలో సర్వే చేయాల్సిన అవసరం ఉందని గమనించి ఈ ప్రక్రియ చేపట్టామని అన్నారు.

భూముల మ్యూటేషన్ సమయంలో కుటుంబ సభ్యులందరికీ తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, 30 రోజుల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చట్టంలో మార్పులు తీసుకొని వచ్చామని అన్నారు. భూ యాజమాన్య వివాదాలను గతంలో సివిల్ కోర్టులో మాత్రమే పరిష్కారం ఉండేదని, ప్రభుత్వం తహసిల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టులను మళ్లీ ప్రవేశ పెట్టిందని అన్నారు. గతంలో జరిగిన సర్వే ఆధారంగా భూ రికార్డులు ఉన్నాయని ప్రస్తుతం ములుగు మాడు గ్రామంలో సర్వే పైలట్ ప్రాజెక్ట్ చేస్తున్నామని, ఆదునిక సాంకేతికత డిజిపిఎస్ వ్యవస్థ, డ్రోన్ లను వినియోగిస్తూ భూముల వివరాలు స్పష్టంగా నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జెడి ప్రసన్న లక్ష్మీ, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహసీల్దార్ ఉషా శారద, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మహోన్నత ఆశయంతో ఇందిరా డెయిరీ ఏర్పాటు...

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మధిర నియోజకవర్గంలో గొప్ప ఆశయంతో చేపట్టిన కార్యక్రమం ఇందిరా డెయిరీ అని, అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజిమిల్ ఖాన్ తో కలిసి, డిఆర్డీవో, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఇందిరా డెయిరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందజేయాలని, సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంట్రిబ్యూషన్ కు సంబంధించి సభ్యులకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరా డెయిరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని, అసలు గేదెలు లేనివారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

రానున్న ఐదు నెలల లోపు నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఇందిరా డెయిరీ పథకం ప్రారంభం కావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనులు వేగవంతం చేసేందుకు గేదెల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో అధికారుల బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజిమిల్ ఖాన్ ను ఆదేశించారు. గేదెల కొనుగోలు బృందంలో తప్పనిసరిగా ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న గేదెలు, కొత్తగా రాబోతున్న గేదెలు వాటికి అవసరమైన పచ్చి గడ్డి, ఎండు గడ్డి వివరాల సమీక్ష నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గడ్డి అవసరం ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు గడ్డి సరఫరాకు అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపట్టి వారికి ఉపాధి తో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పథకం పకడ్బందీగా చేపట్టి పటిష్ట కార్యాచరణ తో ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ సమీక్ష లో డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డిటిడబ్ల్యుఓ విజయలక్ష్మి, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, డివిహెచ్ఓ శ్రీనివాస రావు, డీఏఓ పుల్లయ్య, డిబిసిడిఓ జ్యోతి, ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల ద్వారా మాత్రమే సాధ్యం..

- **బడిబాట కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**






ప్రభుత్వ పాఠశాలలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఐ.డి. ఓ.సి, కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో కూడిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 6 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి అందరికీ తెలియజేసి, వారందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

6 నుండి 14 సం. వయసు కలిగిన బడిఈడు పిల్లలందరిని గుర్తించి, సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు.

మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో, మహిళా సమాఖ్యల ద్వారా, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన విద్య గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు.

బడిబాట కార్యక్రమంలో అధికారులు ప్రభుత్వ పాఠశాలలకు ఎవరైతే పిల్లలను పంపించడానికి ఇష్టపడటం లేదో దానికి గల కారణాలను నమోదు చేయాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు గ్రామాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు అందించే నాణ్యమైన విద్య గురించి వారికి అవగాహన కల్పించి తల్లిదండ్రుల యొక్క డబ్బు వృధా కాకుండా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా రానున్న రెండు వారాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి వాటికి తగిన మరమ్మతులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు మట్టి ఇటుకలతో ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో ఏకరూప దుస్తుల తయారీ పూర్తి చేసి అన్ని పాఠశాలలకు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సదుపాయాలు మరియు పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉల్లాసం యాప్ ద్వారా 15 సంవత్సరాల కంటే పైబడిన వయస్సు వారిలో నిరక్షరాశులను గుర్తించి వారికి అభ్యాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 100% అక్షరాస్యత సాధించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు.

అదేవిధంగా ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహనలో భాగంగా, పాఠశాలల్లోని ఎకో క్లబ్స్ ఆధ్వర్యంలో, సీడ్ బ్యాంకు ద్వారా విత్తనాలు ఎక్కువగా సేకరించిన పాఠశాలలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలలో 100% ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తులసి, చింత, ఉసిరి, వెలగ, మునగ మరియు కరివేపాకు చెట్లు విస్తృతంగా నాటాలన్నారు. జిల్లావ్యాప్తంగా అజోళ్ల, బయోచార్, కంపోస్ట్ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల నిర్మాణం, ఫామ్ పౌండ్స్ నిర్మాణం వంటి అంశాలపై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమన్వయ సమావేశంలో జిల్లా విద్యా శాఖ కోఆర్డినేటర్లు పి. పి.టి లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, మెప్మా పీడీ రాజేష్, జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇందిర, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, ఏపీఎంలు మరియు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ఖమ్మం జిల్లాలో పరవళ్ళు తొక్కనున్న "గోదావరి"

- **ఈనెల 10లోగా పూర్తిచేయాలని మంత్రి "తుమ్మల"ఆదేశం**
- **2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక**
- **వైరా,సత్తుపల్లి,అశ్వరావుపేట,మధిర నియోజకవర్గాలకు సాగు, త్రాగునీరు**
- **లింక్ కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి "తుమ్మల"**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలమే లక్ష్యంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రూపుదిద్దుకుంది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ లో కీలకమైన రాజీవ్ లింక్ కెనాల్ పనులు 7.86 కిలోమీటర్ల కెనాల్ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. చివరగా ఒక కిలోమీటర్ కెనాల్ పనులు వారంలో పూర్తి చేయనున్నారు. అశ్వాపురం పంప్ హౌస్ నుంచి మిగిలిన రెండు పంప్ హౌస్ ల ద్వారా వైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు రానున్నాయి. మొదటి పంప్ హౌస్ నుండి 2,3 పంప్ హౌస్ ల వరకు మెయిన్ కెనాల్ లో పేరుకు పోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి మరియు లైనింగ్ పనులు పూర్తి చేసి, 3 పంప్ హౌస్ ల నుండి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీటిని అందించాలని మంత్రిగారు ఆదేశించారు. సీతారామ పంపుహౌస్‌లు 1, 2, 3 ద్వారా ఖమ్మం జిల్లాలో గోదావరి పరవళ్ళు తొక్కేలా మంత్రి తుమ్మల పనులకు శ్రీకారం చుట్టారు. సీతారామ ప్రాజెక్ట్ మంత్రి తుమ్మల కల... అది పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి పరవళ్ళ తో సస్యశ్యామలంగా మారుతుంది. లక్షలాది ఎకరాల భూములు పసిడి పచ్చల హారం ధరించనుంది. దీంతో మంత్రి తుమ్మల కల సాకారం కానుంది.

**కెనాల్ ద్వారా... 3 నియోజకవర్గాలకు సాగునీరు...**

రాజీవ్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలో పలు నియోజకవర్గాలకు సాగు నీరందించేలా పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గోదావరి జలాల ద్వారా వైరా చెరువు నింపేలా చర్యలు చేపట్టారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలలోని ఎన్ఎస్పి ఆయకట్టుకు నీరును అందించేలా ప్రణాళికలు చేశారు. ఈ నెలలో వరి నార్లు పోసే సమయానికి నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

**వేగంగా యాతాలకుంట టన్నెల్ పనులు...**

యాతాలకుంట టన్నెల్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి చేసి సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాల కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు మంత్రి తుమ్మల విశేష కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీడు భూములు లేకుండా పచ్చని పైర్లతో తులతూగేలా మంత్రి తుమ్మల అహర్నిశలు శ్రమిస్తున్నారు.

**రెండు నెలల ముందే నీటి విడుదల...రెండు పంటలకు అవకాశం....**

ఖమ్మం జిల్లా రైతులకు సాగర్ జలాల కంటే రెండు నెలల ముందే గోదావరి జలాలను తీసుకురావాలని దృఢ సంకల్పంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పనిచేస్తున్నారు. కాలువలపై అనునిత్యం తిరుగుతూ పనులు పర్యవేక్షిస్తున్నారు. రాజీవ్ లింక్ కెనాల్ మొత్తం 8.86 మీటర్లు ఉండగా ఇప్పటికే 7.86 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన కిలోమీటర్ పనులు వారంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. రెండు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించి రైతాంగం సుభిక్షంగా రెండు పంటలు వేసేలా అడుగులు వేస్తున్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కృషిని పనుల పురోగతి వెల్లడిస్తుంది. రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఒక పంటకు సరైన నీళ్లు రాని పరిస్థితి నుంచి రెండు పంటలకు నీరు అందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల**

రాజీవ్ కెనాల్ ( ఏన్కూరు లింకు కాలువ) పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన ఈనెల 10వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యం లేకుండా పనులు శరవేగంగా జరగాలని, 10 తేదీ నాటికి గోదావరి జలాల విడుదలకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.







# పేదల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రభుత్వ లక్ష్యం

**నేలకొండపల్లి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

పేదలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సజావుగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలంలో మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసారు. ముజ్జుగూడెం గ్రామంలో రూ. 16 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పశుసంవర్ధక శాఖకు చెందిన సబ్ సెంటర్ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. నేలకొండపల్లి గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, భైరవుని పల్లిలో రూ. 4 కోట్ల 72 లక్షల 50 వేలతో భైరవునిపల్లి నుండి నాచేపల్లి వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి, చెన్నారం గ్రామం ఎస్సి కాలనీల్లో రూ. 22 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంఖు స్థాపన చేశారు. బోదులబండ గ్రామం ఎస్సి కాలనీ , ముస్లిం బజార్ లలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆసుపత్రిని ఇప్పుడే ప్రారంభించుకున్నట్లు తెలిపారు. గత పాలకులు అందించిన సంక్షేమ పథకాలను కూడా మన ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు. ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. రైతులకు దాదాపు రూ. 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయం ఎకరానికి రూ. 12 వేల రూపాయలకు పెంచామని, రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేశామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు తప్పనిసరిగా అందిస్తామని, మొదటి విడతలో సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన పేదలకు నాలుగు విడతలుగా రూ. 5 లక్షల రూపాయల సహాయం ఇందిరమ్మ ఇంటి కోసం అందిస్తామని అన్నారు. ముజ్జుగూడెం నుంచి గువ్వలగూడెం రోడ్డు రూ. 2 కోట్ల 60 లక్షలతో మంజూరు చేసామని, త్వరలోనే వాటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విడతలవారీగా అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శ్రీనివాసరావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏడిఏ సరిత, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో ఎర్రయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు**

**హన్మకొండ జిల్లా,తెలంగాణ ముచ్చట్లు:**

రైతుల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలవుతోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఐనవోలు మండల పరిధిలోని పున్నేల్ గ్రామంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత పాలకులు ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వల్ల అనేకమంది రైతులు తమ భూముల పత్రాలు కోల్పోయారని, వేల ఎకరాల భూములు సమస్యల్లో చిక్కుకుపోయాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ చేసే అవకాశం లేకపోవడం వల్ల రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు.

ఇప్పటి భూ భారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం చేసే అవకాశం కలిగిందని, ఇందులో తహసీల్దార్ స్థాయిలో జరిగిన తప్పులపై ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో అప్పీలు చేసే అవకాశం కల్పించారని వివరించారు. లైసెన్స్డ్ సర్వేయర్లతో భూముల ఖచ్చితమైన సరిహద్దులు నిర్దేశించి మ్యాపు రూపంలో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైందని, భవిష్యత్తులో భూమికి ప్రత్యేక గుర్తింపుగా 'భూదార్' జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఇప్పటికే హెల్ప్ డెస్కులు, జనరల్ డెస్కులతో రైతులకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో దరఖాస్తులు పరిశీలించి, అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతులు తమ సమస్యలు నేరుగా "డయల్ యువర్ ఎమ్మెల్యే" ద్వారా 8096107107 నంబరుకు తెలియజేయవచ్చని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు.

## పేద కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం



- **336 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ**
- **నియోజకవర్గంలో ప్రతి అర్హుడికి ఇల్లు కట్టే బాధ్యత నాది**
- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు**

**హన్మకొండ, జూన్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని వేగవంతం చేసింది. వర్ధన్నపేట నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇండ్లలో మొదటి దశగా 336 మందికి మంజూరు పత్రాలు మంగళవారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యుడు కేఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొన్నారు. ఐనవోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఈ పత్రాల పంపిణీ జరిగింది. ప్రారంభ వేడుకలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ – "పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వని ఘనత గత పాలకులది. కానీ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పరిపాలన సాగిస్తోంది. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉండే ఇల్లు, ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమవుతుంది. ఎవరు అధైర్యపడకండి. దశలవారీగా ప్రతి అర్హుడికీ ఇల్లు మంజూరు చేస్తాం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానంటూ డబ్బులు అడిగిన నాయకులు, అధికారులు ఎవరైనా ఉన్నట్లయితే వారిని కటకటాలకే పంపించటం జరుగుతుంది" అని హితవు పలికారు.

ఈ సందర్భంగా ఐదుగురు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, రైతులకు విత్తనాలు కూడా పంపిణీ చేశారు. ప్రజలతో నిత్యం మమేకమై ఉండాలని, వారికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. "నా గెలుపులో భాగస్వాములైన నాయకులను కాపాడుకునే బాధ్యత కూడా నా మీదే" అని అన్నారు.

# హనుమకొండ పిఎంహెచ్ హాస్టల్ వార్డెన్‌పై నిర్లక్ష్య ఆరోపణలు

- **సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల డిమాండ్**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా జూలైవాడలోని ప్రభుత్వ పిఎంహెచ్ గర్ల్స్ హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్న వార్డెన్ జ్యోతి తీరుపై గిరిజన ప్రజాసంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, హాస్టల్‌లో అధికారిక మెనూ ప్రకారం భోజనం కల్పించకుండా తాను చెల్లెలిగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఆమెను తక్షణమే సస్పెండ్ చేయాలని డిటిడిఓ ప్రేమకల రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కునుసోతు మురళినాయక్, అజ్మీరా వెంకట్నాయక్, బానోతు భాస్కర్నాయక్, లావుడియా రాజు నాయక్ మాట్లాడుతూ, విద్యార్థినుల రక్షణ, భద్రతకు బాధ్యత వహించాల్సిన హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా ఒక విద్యార్థిని మిస్సింగ్ కావాల్సిన స్థితి ఏర్పడిందని అన్నారు. నాలుగు రోజుల క్రితం హాస్టల్‌కు వెళ్లిన ఒక అమ్మాయి కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు సుబేదారి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమ కుమార్తె కోసం హాస్టల్‌కి వెళ్లిన తల్లిదండ్రులు వార్డెన్‌ను వివరాలు అడిగిన సమయంలో ఆమె



నిర్లక్ష్యంగా స్పందించడమే కాకుండా, "మీ అమ్మాయి ఎక్కడుందో నాకు తెలియదు, నాకు సంబంధం లేదు," అంటూ అసభ్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.

తరువాత పోలీసులు తక్షణంగా స్పందించి, ఆ బాలికను గుర్తించి స్టేషన్‌కు తీసుకురావడంతో పాటు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై వివరణ కోరిన గిరిజన సంఘాల నాయకులకు వార్డెన్ జ్యోతి తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిందని తెలిపారు. హాస్టల్‌లో చదువుకునే విద్యార్థుల భద్రతను అగ్రగణ్యంగా తీసుకోవాల్సిన వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ప్రవర్తన తగదని, ఆమెపై సంపూర్ణ విచారణ జరిపి తక్షణమే సస్పెండ్ చేయాలని డిటిడిఓను కోరారు. లేదంటే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- **పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ కలగాలి**
- **మాజీ మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి**

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి కోరుకున్నారు. మంగళవారం పెద్దమందడి గ్రామములో,వైభవంగా జరిగిన పెద్దమ్మ పండుగ ఉత్సవాలలో సింగిరెడ్డి వాసంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంతి గారు మాట్లాడుతూ..ప్రజలందరూ సుఖ సంతోషాలతో,పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో బొడ్రాయి పండుగ సందర్భంగా..గ్రామస్తులను ఉద్దేశించి అన్నారు.సకాలంలో వర్షాలు కురిసి రైతులు పండించే పంటలకు సహకరించాలని గ్రామ దేవతలైన బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ అమ్మవారిని, ప్రజలను చల్లగా ఉండేటట్లు చూడాలని కోరారు. పెద్దమందడి గ్రామ ప్రజలు పోచమ్మ పండగ సందర్భంగా, దూర ప్రాంతాల్లో నుండి విచ్చేసినటువంటి, కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు,శ్రేయోభిలాషులకు,పేరుపేరునా పెద్దమ్మ పండుగ ఉత్సవాల పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజలందరికీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో,, బి ఆర్ ఎస్ నాయకులు పురుషోత్తం రెడ్డి గారి ఆహ్వానం మేరకు, వారి ఇంట్లో విందులో పాల్గొన్నారు .ఈ సందర్భంగా గ్రామంలో కలిసిన వారినల్లా యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. సింగిరెడ్డి వాసంతి వెంట మాజీ జెడ్పీటీసీ కి. రఘుపతి రెడ్డి ,బి.ఆర్ యస్ పార్టీ పెద్దమందడి మండల అధ్యక్షులు సేనాపతి, వెల్టూర్ మాజీ రైతుబంధు అధ్యక్షులు జి.రఘువర్ధన్ రెడ్డి ఎం.రవీందర్ రెడ్డి, ఎం. రాజ మహేందర్ రెడ్డి, నాగేంద్రం యాదవ్, వెంకట్ రెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ధర్మారెడ్డి రాంరెడ్డి కురుమూర్తి, బాలకృష్ణ యాదవ్, శ్రీనివాస్ సాగర్,జంగం రమేష్, గొల్ల మోగులయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలుసు కదా.. భలే మంచి డేటు పదా

టిల్లు సిరీస్ లో రెండు సినిమాలు బ్లాక్ బస్టరయ్యాక సిద్దు జొన్నలగడ్డకు జాక్ ఇచ్చిన షాక్ మాములుది కాదు. కనీసం యావరేజ్ అయినా ఏదోలే అని సర్దుకోవచ్చు కానీ దారుణంగా డిజాస్టర్ కావడం ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోయారు. ఒక రకంగా చెప్పాలంటే కంటెంట్ బాలేకపోతే ఓపెనింగ్స్ తెచ్చే రేంజ్ కు సిద్దు ఇంకా చేరుకోలేదనే మెసేజ్ అయితే జాక్ ఇచ్చింది. ఇప్పుడు నెక్స్ట్ తెలుసు కదాతో రాబోతున్నాడు. అక్టోబర్ 17 విడుదల చేయబోతున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. నీరజ కోన దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ లవ్ ఎంటర్టైనర్ కు తమన్ సంగీతం సమకూర్చాడు. ఇది భలే డేటు అనడానికి కారణాలున్నాయి. దసరా పండగ అయిపోయిన తర్వాత స్లాట్ తీసుకోవడం కొందరికి కరెక్ట్ అనిపించకపోవచ్చు కానీ ప్యాన్ ఇండియా మూవీస్ తో తక్కువ గ్యాప్ లో తలపడి కలెక్షన్లు దెబ్బ తీసుకోవడం కన్నా ఇదే మంచి నిర్ణయం. అక్టోబర్ మూడో వారం నాటికి వార్ 2, కూలి, మాస్ జాతర, ఓజి, అఖండ 2, కాంతార చాప్టర్ 1 తదితర సినిమాల థియేటర్ రన్ పూర్తయిపోయి ఉంటుంది. సో తెలుసు కదాకు టాలీవుడ్ వరకు సోలో ఛాన్స్ దక్కుతుంది. అదే తేదీకి రష్మిక మందన్న బాలీవుడ్ హారర్ మూవీ తమని అనౌన్స్ చేశారు కానీ ఖచ్చితంగా వస్తుందా అనేది ఇప్పుడే చెప్పలేం. ఒకే ఏడాదిలో రెండు సినిమాలు రిలీజ్ చేయడం ద్వారా సిద్ధూ జొన్నలగడ్డ స్పీడ్ పెంచినట్టే అనుకోవాలి. తెలుసు కదాలో హిట్ 3 భామ శ్రీనిధి శెట్టితో పాటు రాశి ఖన్నా హీరోయిన్ గా నటించింది. పైకి ముక్కోణపు ప్రేమకథగా కనిపించినా సర్ప్రైజ్ ఎలిమెంట్స్ చాలా ఉంటాయని టీమ్ చెబుతోంది. మ్యూజికల్ గా తమన్ లోని కొత్త షేడ్ ని ఇందులో చూడొచ్చని అంటున్నారు.


# దేవి హై వోల్టేజ్ బీట్స్‌లో 'అనగనగా కథ'




శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' సినిమా విడుదల విషయంలో కాస్త ఆలస్యంగా వస్తున్నప్పటికీ పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేస్తోంది. లీడర్ తరువాత మళ్ళీ అలాంటి ఫీల్ కలిగిస్తోన్న కమ్ముల తప్పకుండా కమర్షియల్ బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తాడని ఓ వర్గం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సోషల్ థ్రిల్లర్, సమాజంలోని ఆర్థిక అసమానతలు, అధికార ఆకాంక్షల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. వీరమల్లు.. ఆ విషయంలో నిర్మాత పర్ఫెక్ట్ డిసిషన్! జిమ్ సర్భ్, దలీప్ తాహిల్ కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ సినిమాలో తొలిసారి నాగార్జున, ధనుష్ కలిసి నటిస్తుండటంతో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏషియన్ సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ రావు నిర్మాణంలో ఈ సినిమా జూన్ 20న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, 'పోయిరా మామా' సాంగ్‌తో అభిమానులను ఆకర్షించింది. ధనుష్ ఒక బిచ్చగాడి పాత్రలో, నాగార్జున ఒక ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా, రష్మిక మిడిల్ క్లాస్ అమ్మాయిగా కనిపించనున్నట్లు టీజర్ హైలెట్ చేసింది. సినిమా సమాజంలో అంతరాలు, ఆర్థిక వ్యవస్థపై ఆలోచింపజేసే కథనంతో రూపొందుతోందని తెలుస్తోంది.

ఇప్పుడు ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'అనగనగా కథ' విడుదలై, అందరినీ ఆకట్టుకుంటోంది. దీపికా ఇక్కడ తగ్గిందా? దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'అనగనగా కథ' సాంగ్, రాక్ బీట్స్‌తో సమాజ సత్యాలను తెరపైకి తెచ్చింది. హైడ్ కార్టీ, కరీముల్లా ఆలపించిన ఈ పాట, ధని పేద అంతరాలను, అణచివేతను గురించి ఆలోచింపజేసేలా ఉంది. ఆస్కార్ విజేత చంద్రబోస్ రాసిన సాహిత్యం అత్యంత అర్థవంతంగా, సినిమా కథను ప్రతిబింబించేలా ఉంది. ఈ పాట సమాజంలోని ఆర్థిక వ్యత్యాసాలను, అణగారిన వర్గాల బాధలను తీవ్రంగా చూపిస్తూ, ఆలోచనలో ముంచెత్తింది. లిరికల్ వీడియోలో ఉపయోగించిన ఫోటోల్లో నాగార్జున, ధనుష్ కెమిస్ట్రీ స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా పాత్రల వివరాలు స్పష్టంగా తెలియకపోయినా, వీరిద్దరి పాత్రల తీవ్రత అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ సాంగ్ సినిమా కథను మరింత లోతుగా పరిచయం చేస్తూ, ఆర్థిక డ్రామాకు సరైన నేపథ్యాన్ని సిద్ధం చేసిందని అభిమానులు అంటున్నారు.

# రాజేంద్రప్రసాద్ కావాలని అనలేదు




సీనియర్ నటుడు ఇటీవల రెండుసార్లు స్టేజ్ మీద అదుపు తప్పి మాట్లాడడం చర్చనీయాంశం అయింది. 'రాబిన్ హుడ్' ఈవెంట్లో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌ను ఉద్దేశించి అన్న మాట మీద జరిగిన రభస చాలదని.. తాజాగా ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో కమెడియన్ ఆలీని ఉద్దేశించి అన్న బూతు మాట తీవ్ర వివాదాస్పదమైంది. తనపై విమర్శల దాడి నేపథ్యంలో రాజేంద్ర ప్రసాద్ ఆల్రెడీ స్పందించారు. తాను సరదాగా అన్న మాటను తప్పుగా అర్థం చేసుకుంటే అది మీ కర్మ అని తేల్చేశారు. ఇదే సమయంలో మాట పడ్డ ఆలీ సైతం ఈ వివాదంపై స్పందించారు. రాజేంద్ర ప్రసాద్ సరదాగానే ఆ మాట అన్నారని.. దీన్ని వివాదం చేయొద్దని ఆలీ కోరారు. రాజేంద్ర ప్రసాద్ కూతురిని కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న విషయాన్ని ఆలీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. "నిన్న కృష్ణారెడ్డి గారి పుట్టిన రోజు వేడుకల్లో రాజేంద్ర ప్రసాద్ గారి నోటి నుంచి అనుకోకుండా ఆ మాట దొర్లింది. సరదాగా. కానీ ఏంటంటే.. దీన్ని తీసుకుని మీడియా మిత్రులు వైరల్ చేస్తున్నారు. ఆయన మంచి ఆర్టిస్టు. ఆయన పుట్టెడు దు:ఖంలో ఉన్నారు. ఇటీవల కాలంలో కూతురు పోయింది. అమ్మ లాంటి బిడ్డ. కావాలని అన్నది కాదు. దీన్ని ఎవరూ కూడా రభస చేయకండి. ఆయన పెద్దాయన. నమస్కారం'' అని ఆలీ వ్యాఖ్యానించాడు.



# ఆర్య 3 రిస్కు వెనుక అసలు లెక్కలు

అల్లు అర్జున్ కి రెండో సినిమాతోనే ఇమేజ్, ఫాలోయింగ్ తెచ్చిన సినిమాగా ఆర్య మీద అభిమానులకు ప్రత్యేకమైన గౌరవముంది. పుష్పతో ఇండియాని షేక్ చేసే రికార్డులు సాధించిన సుకుమార్ ని పరిచయం చేసిన బ్లాక్ బస్టర్ ఇదే. ఆ అంచనాల బరువు ఎక్కువైపోయి ఆర్య 2 అప్పట్లో ఆశించిన విజయం అందుకోలేదు. ఇటీవలే రీ రిలీజ్ చేస్తే ఫ్యాన్స్ పాటలను, బన్నీ వెరైటీ క్యారెక్టరైజేషన్ ని ఎంజాయ్ చేశారు కానీ కంటెంట్ పరంగా ఇప్పటికీ అందులో హెచ్చుతగ్గులు ఫీలవుతాం. ఏది ఏమైనా ఆర్య అంటే చాలు ఠక్కున గుర్తొచ్చేది అల్లు అర్జున్ ఒక్కడే. ఇప్పుడు ఆర్య 3కి రంగం సిద్ధమవుతోంది. అయితే ఈసారి హీరో మారుతున్నాడు. నిర్మాత దిల్ రాజు ఫ్యామిలీ హీరో ఆశిష్ తో ఆర్య 3 తీయడం దాదాపు లాకైపోయినట్టే. ఫస్ట్ పార్ట్ తీసిన ప్రొడ్యూసర్ ఆయనే కాబట్టి టైటిల్ గురించి హక్కుల సమస్య లేదు. ఎలాగూ బన్నీ ఈ సీక్వెల్ ని చేసే ఛాన్స్ ఎంత మాత్రం లేదు. సో ఆశిష్ కి ఇవ్వడం న్యాయమే. కానీ అంత లెగసి ఉన్న టైటిల్ ని ఇప్పటిదాకా సరైన హిట్టు లేని ఈ కుర్రాడు మోయగలడా అనే దాని మీద అనుమానం లేకపోలేదు. అయితే అభయహస్తం ఇస్తూ సుకుమార్ దీనికి స్క్రీన్ ప్లే సహకారంతో పాటు మాటలు అందిస్తానని హామీ ఇచ్చారట. ఆయన రైటింగ్స్ అనే ముద్ర పడితే ఆటోమేటిక్ గా థియేటర్ తో పాటు ఓటిటిలో కూడా డిమాండ్ వచ్చేస్తుంది. ఆర్య తరహాలో ఆర్య 3లో హీరోకి డిఫరెంట్ పాత్రని డిజైన్ చేసినట్టు ఇన్ సైడ్ టాక్. వన్ సైడ్ లవ్ లాగే ఈసారి ఎవరూ ఊహించని సర్ప్రైజ్ ని సుకుమార్ ఇస్తారట. గతంలో ఇదే ఆశిష్ తో తన రచనలో కాశి విశాల్ దర్శకుడిగా సెల్ఫిష్ షూటింగ్ మొదలుపెట్టి రషెస్ సరిగా రాక పక్కనపెట్టిన సంగతి తెలిసిందే.



# రాజా సాబ్ వస్తున్నాడు.. డేట్లు ఖరారు ?

ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న ది రాజా సాబ్ రాకకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల జూన్ 15 టీజర్ రిలీజ్ చేయబోతున్నట్టు లేటెస్ట్ అప్డేట్. అందులోనే సినిమా ఎప్పుడు విడుదవుతుందనేది పొందు పరిచారట. విశ్వసనీయ సమాచారం మేరకు టాలీవుడ్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ హారర్ డ్రామా డిసెంబర్ 12న థియేటర్లలో అడుగుపెట్టనుందని తెలిసింది. డిసెంబర్ 25 అడివి శేష్ డెకాయిట్ తీసుకున్న నేపథ్యంలో అదే నెల మొదటి వారం కన్నా మధ్యలో రావడమే బిజినెస్ కోణంలో బెస్టని భావించి ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారని యూనిట్ సభ్యుల మాట. అఫీషియల్ స్టాంప్ లేదు కాబట్టి ఖచ్చితంగా చెప్పలేం కానీ నిజమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బ్యాలన్స్ ఉన్న పాటలు, షూటింగ్ ని అక్టోబర్ లోగా పూర్తి చేద్దామని ప్రభాస్ హామీ ఇవ్వడంతో దర్శకుడు మారుతీ ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవడంలో బిజీ అయ్యారట. టీజర్ కు డబ్బింగ్ అయిపోయింది. విజువల్స్ చూశాక అంచనాలు మారిపోవడం ఖాయమని, ఆశించిన దానికన్నా చాలా ఎక్కువ బిజినెస్ జరుగుతుందనే ధీమాతో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఉందట. ఈ మధ్యే లీకైన స్టిల్ చూసి డార్లింగ్ ఫ్యాన్స్ మాములుగా వెర్రెక్కిపోలేదు. ఇక అదే గెటప్ తో డైలాగులు చెబుతూన్న ప్రభాస్ ని చూస్తే ఏమైపోతారో ఊహించడం కష్టం. సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్ వచ్చిన నెలలోనే ది రాజా సాబ్ రావడం మంచిదే. సంక్రాంతి కన్నా ముందే బాక్సాఫీస్ దగ్గర మొత్తం రాబట్టుకోవచ్చు. అనుకుంటాం కానీ కరెక్ట్ కంటెంట్ పడితే ఈ నెలలో వచ్చిన బ్లాక్ బస్టర్లు చాలానే ఉన్నాయి. ప్యాన్ ఇండియా రిలీజ్ కాబట్టి హిందీ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని డిసెంబర్ 12 ఎంచుకున్నట్టు తెలిసింది. ఎందుకంటే క్రిస్మస్ కి యష్ రాజ్ ఫిలింస్ అలియా భట్ స్పై మూవీ 'ఆల్ఫా'ని ప్లాన్ చేస్తోందట.

# 'విడదీయరాని బంధం'

టాలీవుడ్ అగ్రతార సమంత తరచూ సోషల్ మీడియాలోని అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక పోస్ట్‌తో నెటిజన్లను అలరిస్తుంటుంది. ఇకపోతే సమంత ఇప్పటికి సినీ పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చి పదిహేను ఏళ్లు అవుతుందన్న విషయం తెలిసిందే. కాగా ఈ నడుమ సామ్ అనేక అవార్డులు సొంతం చేసుకుంది. అలాగే సమంత రూత్ ప్రభుకు రీసెంట్‌గా సిటాడెల్: హనీ బన్నీ వెబ్ సిరీస్‌లో ఆమె నటనకు గాను ఉత్తమ నటి అవార్డు కూడా లభించింది. అలాగే సినీ పరిశ్రమలో 15 సంవత్సరాల అనుభవం పూర్తి చేసుకున్నందుకు గాను ఆమెను సత్కరించారు.

జీ తెలుగు ఛానల్ నిర్వహించిన ఒక అవార్డు ఫంక్షన్‌లో సమంతకు ఈ పురస్కారాన్ని అందించారు. ఈ బ్యూటిఫుల్ హీరోయిన్‌కు ఉత్తమ నటిగా అవార్డు రావడంతో సోషల్ మీడియా వేదికన అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఇకపోతే సమంత ప్రస్తుతం నిర్మాతగా మారి తనలోని మరో టాలెంట్ బయటపెడుతోన్న విషయం తెలిసిందే. నిర్మాతగా మొదటి సినిమా శుభంను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఈ మూవీకి నెటిజన్ల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చింది. ఇదంతా పక్కన పెడితే.. సమంత తాజాగా కుక్క అండ్ పిల్లి ఫొటో పంచుకుని ఇన్‌స్టా స్టోరీలో 'విడదీయరానివి' అని రాసుకురాగా.. అలాగే 'విస్తృతంగా మేల్కొని కలలు కనడం' ఓ క్యాప్షన్ రాసుకొచ్చి.. పోస్ట్ పెట్టింది. ఈ పోస్టులో పలు ఫొటోలు కూడా పంచుకుంది.





# డేంజర్ బాయ్స్' వస్తున్నారు

కన్నడలో అనూహ్య విజయం సాధించిన 'అపాయవీడి హెచ్చరిక' చిత్రం 'డేంజర్ బాయ్స్' పేరు తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. దర్శకనిర్మాత శ్రీరంగం సతీష్ కుమార్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్ లుక్ రిలీజ్ చేయగా.. టీజర్‌ను దర్శకనిర్మాత డాక్టర్ లయన్ సాయి వెంకట్, పాటలను ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సత్యవర్ధన్ విడుదల చేశారు. ట్రైలర్‌ను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ ఆవిష్కరించారు. దండుపాళ్యం, కేజిఎఫ్, కాంతారా చిత్రాల కోవలో.. కన్నడలో అనూహ్య విజ యం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సంచలనం సృష్టించడం ఖాయమని అతిథులు పేర్కొన్నారు. ఈ ట్రైలర్, సాంగ్స్ చూస్తుంటే.. ఈ చిత్రం మరో 'మంజమల్ బాయ్స్' అవుతుందనిపిస్తోందని వారు తెలిపారు. యశశ్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్ పతాకాలపై శ్రీరంగం సతీష్ కుమార్ సమర్పణలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రానికి రచన, %% దర్శకత్వం వహించారు అభిజిత్ తీర్థహల్లి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 3153 దరఖాస్తుల స్వీకరణ ...

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



ఖమ్మం జిల్లాలో 19 మండలాల పరిధిలోని 37 గ్రామాలలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ప్రజలనుంచి భూ సమస్యలపై 3153 దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం ముందస్తుగా ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం, బోనకల్ మండలాలను పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించి ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లాలోని మిగిలిన 19 మండలాల్లోని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ ఆధ్వర్యంలోని రెవెన్యూ బృందం సందర్శించి భూ హక్కులకు సంబంధించి ఉన్న సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని, భూభారతి చట్టం నిబంధనలకు ప్రకారం ఈ సమస్యలను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని 19 మండలాల్లోని 37 గ్రామాలలో రెవెన్యూ బృందాలచే సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి 3153 భూ సమస్యలు స్వీకరించామని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగినప్పుడు సమస్యలపై దరఖాస్తులు అందించాలని, దరఖాస్తులతో పాటు ప్రజల వద్ద అందుబాటులో ఉన్న ఆధారిత డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నైజీరియాలో జలవిలయం.. 700 మంది మృతి..!

న్యూ డిల్లీతెలంగాణ ముచ్చట్లు) :



ఆఫ్రికా దేశం ను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. నైగర్ రాష్ట్రంలోని మోక్వా పట్టణంలో భారీ వరదలతో మరణించినవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. దాదాపు 700 వందల వరకూ ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా గురువారం ఉదయం అకస్మాత్తుగా కుండపోత వర్షం కురవడంతో దాదాపు ఐదు గంటల్లోనే భారీ వరద పట్టణాన్ని ముంచెత్తిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ వరదలకు ఇప్పటి వరకూ 200కి పైగా మృతదేహాలను గుర్తించారు. మరో 500 మంది ఆచూకీ గల్లంతైంది. వారంతా వరదల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గల్లంతైన వారిలో ఎవరూ సజీవంగా ఉండే అవకాశం లేనందున సహాయక చర్యలు నిలిపివేస్తున్నట్లు స్థానిక అధికారి ముసా కాంబోకు విలేకరులకు తెలిపారు. నైగర్ రాష్ట్రంలో వాణిజ్యపరంగా మోక్వా కీలక ప్రాంతం. ఇక్కడ భారీ ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాన్ని అకస్మాత్తుగా వరదలు ముంచెత్తడంతో ప్రాణ నష్టం అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణానికి రాకపోకలు సాగించే రెండు రోడ్లు, రెండు బ్రిడ్జీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. ఇక ఈ వదరలకు వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి. అనేక మంది గాయపడ్డారు.






# విపత్తు సమయంలో నష్టాల నివారణకు పటిష్ట చర్యలు.....

-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: విపత్తు సమయంలో నష్టాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

మంగళవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశం మందిరంలో విపత్తుల నిర్వహణపై ఏర్పాటు చేసిన జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ (డిడిఎంపి) సమావేశంలో ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్డిఆర్ఎఫ్ బృందంతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత సంవత్సరం వరదల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను ఎంపీడీఓలు మండలాల వారీగా, పట్టణాలు, నగరాలలో మున్సిపల్ కమీషనర్లు గుర్తించి అక్కడ ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులు పరిశీలించి రిపోర్ట్ అందించాలని తెలిపారు.

జూన్ 15 నుంచి మహబూబాబాద్, వరంగల్ జిల్లాలలో కురిసే వర్షం వివరాలను కూడా ట్రాక్ చేస్తు, నదీ ప్రవాహాల వివరాలను వాట్సప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. వర్షాల ఉధృతి వివరాలు సేకరించి వాటి ఆధారంగా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రమాద హెచ్చరికలు జారీ చేయాలని అన్నారు.

వరద ఉధృతి మేరకు ముఖ్య ప్రణాళిక అధికారి ఇచ్చే హెచ్చరిక ప్రకారం ప్రభావితమయ్యే సంబంధిత ప్రాంతాల అధికారులు అప్రమత్తం కావాలని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలించేందుకు పకడ్బందీ వ్యవస్థ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు గ్రామ స్థాయికి చేరుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఆపద మిత్రలు గ్రామ గ్రూపులలో ఉండాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 300 మంది ఆపద మిత్రలకు విపత్తు నిర్వహణ నిమిత్తం 12 రోజుల పాటు శిక్షణ అందించామని, వీరి సహకారంతో ప్రజలకు సహాయ కార్యక్రమాలు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.

ప్రతి మండల కేంద్రంలో విపత్తు నిర్వహణ మేనేజ్మెంట్ ప్రణాళిక రూపకల్పనపై ఆపద మిత్రలు, అంగన్వాడి, ఆశా, పంచాయతి కార్యదర్శి, విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నాడు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

శుక్రవారం నాడు గ్రామాలలో పర్యటించి ముందుగా వారి పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాలు, కూలిపోవడానికి దగ్గరగా ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వివిధ బలహీన వర్గాల ప్రజలు ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆపద సమయంలో ఏర్పాటు చేయాల్సిన రిలీఫ్ సెంటర్ ను ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన బాత్ రూమ్ మరమ్మత్తులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలు అవసరం ఉంటే కలెక్టరేట్ ద్వారా కాంటాక్ట్ చేయడం జరుగుతుందని, వరదల పరిస్థితులను కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తూ సమాచారం అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి మండలం వారీగా గజ ఈత గాళ్లను మత్స్యశాఖ అధికారి గుర్తించాలని, ఆ వివరాలను గ్రామ స్థాయికి వాట్సాప్ గ్రూపుల ద్వారా చేర వేయాలని కలెక్టర్ తెలిపారు.

ప్రతి పట్టణ పరిధిలో మున్సిపాలిటీలు విపత్తు నిర్వహణకు అవసరమైన బోటు, ఇతర సేఫ్టీ పరికరాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖకు అవసరమైన పరికరాలు ముందస్తుగానే పెట్టుకోవాలని, వైద్య శాఖ అధికారులు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

త్రాగునీటి సరఫరాకు సంబంధించి వరదల సమయంలో ఎటువంటి అంతరాయాలు వస్తాయో, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. జూన్ 15 నుంచి జిల్లాలో నీటి వనరుల స్థితిగతుల వివరాలు కూడా ఎప్పటికప్పుడు అందించాలని, చెరువులకు అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

విపత్తులను దృష్టిలో ఉంచుకొని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి అధికారి హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి తన శాఖ పరిధిలో సిబ్బంది హెడ్ క్వార్టర్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వల్నరబుల్ ప్రాంతాల్లోనీ ఇండ్లకు ముందస్తుగా జిప్ లాక్ బ్యాగ్ అందించి ముఖ్యమైన సర్టిఫికెట్, కాగితాలు, డబ్బులు, నగలు అందులో భద్రపర్చుకొనే విధంగా తెలియజేయాలని అన్నారు.

ప్రతి ఆపద మిత్రకు అవసరమైన సేఫ్టీ లైఫ్ జాకెట్ అందుబాటులో పెట్టాలని కలెక్టర్ సూచించారు. వరదల సమయంలో ఉపయోగపడే విధంగా అవసరమైన లైఫ్ జాకెట్ స్టాక్ ఏర్పాటు చేసుకోవాలని దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ పని చేయాలని, 1077 నెంబర్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, కంట్రోల్ రూమ్ లో పనిచేసే సిబ్బందికి షిఫ్ట్ ల వారీగా విధులు కేటాయించాలని అన్నారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు తక్షణ స్పందన, సహాయం రెవిన్యూ శాఖ నుంచి వస్తుందని,అత్యవసర ఎమర్జెన్సీ పరిస్థితులలో ప్రజల ప్రాణాల సంరక్షణకు పోలీసు అధికారులు సైతం పూర్తి స్థాయిలో కృషి చేస్తారని అన్నారు.

పోలీస్ అధికారులు ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వరదల, ఇతర విపత్తుల సమయంలో నష్టాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల సమయంలో తప్పుడు కమ్యూనికేషన్ జరగకుండా జాగ్రత్త వహించాలని, లోతట్టు ప్రాంతాల్లో ఎంత మంది ప్రజలు నివసిస్తున్నారు ముందుగా గుర్తించాలని అన్నారు.

ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 12 డివిజన్ లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అక్కడ నష్ట నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి వార్డు లో 20 మంది వాలంటీర్లను గుర్తించి విపత్తు నిర్వహణ శిక్షణ అందించామని అన్నారు. రిలీఫ్ సెంటర్లను గుర్తించి అక్కడ అవసరమైన మౌళిక పరిస్థితులు కల్పిస్తున్నామని, డివిజన్ వారీగా అందుబాటులో ఉన్న గజ ఈతగాళ్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ తెలిపారు. నగరంలో ప్రమాదంగా ఉన్న ట్రాన్స్ఫర్మర్ ల తొలగింపుకు చర్యలు చేపట్టామని అన్నారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ గురువారం మండల/ మున్సిపాలిటీ స్థాయిలో నిర్వహించే సమావేశంలో వల్నరబుల్ గ్రామాల సంఖ్య ఆధారంగా అవసరమైన లైఫ్ జాకెట్ వివరాలు, ప్రతి మండలంలో ఏర్పాటు చేసే రిలీఫ్ సెంటర్ జాబితా వివరాలను అందించాలని అన్నారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వల్నరబుల్ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, పశువులకు సంబంధించి కూడా వల్నరబుల్ ప్రాంతాలను గుర్తించి వాటిని సురక్షితంగా తరలించేందుకు గల అవకాశాలపై రిపోర్ట్ తయారు చేయాలని అన్నారు.

విపత్తు సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, విపత్తు జరిగినప్పుడు ఎలా రెస్పాండ్ కావాలి అనే విషయమై ముందస్తుగా కొన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించనున్నట్లు, అలాగే విపత్తు సమయంలో తాము ఎలా సహాయ పడతామో అనే అంశాలపై ఎన్డిఆర్ఎఫ్ బృందం ఇన్స్ పెక్టర్ గౌతమ్ కుమార్ వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ , జడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, ఎన్డిఆర్ఎఫ్ బృందం ఏ.ఎస్.ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్ కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్ , కె.జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు

# ఈ సాలా కప్ ఆర్సీబీదే..




ఎట్టకేలకు 18వ ప్రయత్నంలో ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ కల సాకారమైంది. అహ్మదాబాద్ లో ని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్లో ఆర్సీబీ విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది.

చివరి ఓవర్‌ను అర్షదీప్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. ఇతర బౌలర్లలో జేమీసన్ 3, ఒమర్‌జాయ్, విజయ్‌కుమార్ వైశాక్, చహల్ తలో వికెట్ తీశారు. ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో 35 బంతుల్లో 43 పరుగులు చేసిన విరాట్ కోహ్లినే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లలో సాల్ట్ 16, లివింగ్‌స్టోన్ 25, జితేశ్ శర్మ 24, మయాంక్ అగర్వాల్ 24, రజత్ పాటిదార్ 26, రొమారియో షెపర్డ్ 17, కృనాల్ పాండ్యా 4, భువనేశ్వర్ కుమార్ 1 పరుగు చేసి ఔటయ్యారు.

అనంతరం 191 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమై 6 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. ఇన్నింగ్స్ మధ్యలో ఒత్తిడికి లోనైన పంజాబ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. ఆఖర్లో శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) పంజాబ్‌ను గెలిపించేందుకు విశ్వ ప్రయత్నం చేశాడు. అయితే అప్పటకే మ్యాచ్ పంజాబ్ చేతుల్లో నుంచి జారి పోయింది.

పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రియాంశ్ ఆర్య 24, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 26, జోస్ ఇంగ్లిస్ 39, శ్రేయస్ అయ్యర్ 1, నేహల్ వధేరా 15, స్టోయినిస్ 6, ఒమర్‌జాయ్ 1 పరుగు చేసి ఔటయ్యారు.ఆర్సీబీ బౌలర్లులో కృనాల్ పాండ్యా (40172) అద్భుతంగా బౌలింగ్ చేసి పంజాబ్ చేతుల్లో నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. భువనేశ్వర్ కుమార్ 2, యశ్ దయాల్, హాజిల్‌వుడ్, షెపర్డ్ తలో వికెట్ తీసుకున్నారు.








Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in